www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 3 జనవరి 2025
5
కాకినాడ



14 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కరప


బాధితునికి చెక్కును అందజేస్తున్న ఎంఎల్ఎ

కాకినాడ రూరల్ పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన 14 మందికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ గురువారం పంపిణీ చేశారు. కాకినాడ [illegible] గల ఎంఎల్ఎ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భోగిరెడ్డి కొండబాబు, బి.గంగాధర్, గణేష్ నాయుడు, యాళ్ల వీరవెంకట సత్యనారాయణ, వి.సూరిబాబు, కె.గోవిందు పాల్గొన్నారు.

చంద్రన్న కానుక అందేనా.?

- 2014లో పంపిణీ చేసిన టిడిపి సర్కారు
- సంక్రాంతి సమీపిస్తున్నా కానరాని ప్రకటన
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

2014లో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన 'చంద్రన్న సంక్రాంతి కానుక'ను గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. టిడిపి పాలనలో పండుగల వేళ కొన్ని సరుకులను లబ్ధిదారులకు అందించేవారు. క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి కేవలం బియ్యం, పంచదార, కందిపప్పు మాత్రమే పంపిణీ చేసింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు కానుకల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సంక్రాంతికి చంద్రన్న కానుకలు అందిస్తారా ? లేదా? అనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. క్రిస్మస్ కానుకలు మరిచిపోయిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి కానుకనైనా ఇవ్వాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం 2019 వరకు పండుగల వేళ కానుకలు అందించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 లక్షల 50 వేల 558 రేషన్ కార్డులుండగా 30 శాతం మందికి క్రిస్మస్ కానుకలను అందించారు. మిగిలిన సుమారు 11 లక్షల 55 వేల మందికి సంక్రాంతి కానుకలను అందించారు. జిల్లా వ్యాప్తంగా రెండూ కలిపి 825 టన్నుల 279 కేజీల కందిపప్పు, 16 లక్షల 49 వేల 681 కేజీల పామాయిల్, 16 లక్షల 50 వేల 558 కేజీల గోధుమ పిండి, 825 టన్నుల 280 కేజీల శనగపప్పు, 824 టన్నుల 923 కేజీల బెల్లం,16 లక్షల 49 వేల 710 (100 గ్రాముల) నెయ్యి ప్యాకెట్లను అందించారు. ఒక్కో కార్డుదారునికి రూ.207.94 పైసలు విలువ చేసే కేజీ గోధుమ పిండి, అర కిలో చొప్పున బెల్లం, పామాయిల్, శనగ పప్పు, కందిపప్పు, 100 గ్రాముల నెయ్యి, ఒక సంచిలో అందజేశారు.

గత టిడిపి ప్రభుత్వంలో పంపిణీ చేసిన సంక్రాంతి కానుకలు(ఫైల్ ఫోటో)

ఈ సంక్రాంతికి అనుమానమే.!

ఈ సంక్రాంతికి ప్రత్యేక కానుకలు లేనట్లేనని తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. చంద్రబాబు సర్కారులో ఏటా ఈ పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.287 కోట్లు ఖర్చు చేసేవారు. కార్డుదారులకు ఆరు రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేసేవారు. అయితే ఈ ఏడాది సంక్రాంతి సమీపిస్తున్నా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఇవ్వాలని అనుకుంటే జనవరి 1వ తేదీ నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. దీని గురించి కానీ జిల్లాలో అటువంటి పరిస్థితి ఏమీ కనిపించడం లేదు. ఏడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం గత ఐదేళ్లకు ముందు అమలు చేసిన అనేక పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పుకొచ్చింది. వివరణ క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కానుకలను కూడా అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఆచరణలో మాత్రం కానుకల సంగతిని కూటమి పాలకులు మర్చిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రజలు ఎంతో ఆదరించిన చంద్రన్న సంక్రాంతి కానుకలు మళ్లీ ఇస్తారని లబ్ధిదారులు ఆశిస్తున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎటువంటి ఆసక్తి చూపకపోతుండడంపై సంక్రాంతి కానుక పథకం అమలయ్యే అవకాశాలు దాదాపుగా కనిపించడం లేదు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోవడంతో నెలనెలా పింఛన్లు, జీతాలకే గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో పలు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం దూరంగా ఉంటుంది.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు

శాస్త్రీయ చరిత్ర రచనతోనే మత సామరస్యం

ప్రజాశక్తి - కాకినాడ

శాస్త్రీయ చరిత్ర రచనలతోనే మత సామరస్యం సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. గురువారం సిపిఎం కాకినాడ రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదర్శ కమ్యూనిస్టు కుడిపూడి సూర్యనారాయణ 22వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా అవాజ్ నాయకులు అష్రఫ్ స్ఫూర్తి ఉపన్యాసం చేశారు. దేశ చరిత్రను కాలాల ఆధారంగా విభజించడానికి బదులు బ్రిటిష్ పాలకులు దేశ ప్రజల మధ్య అనైక్యత దారితీసే కుట్రలు చేశారని అన్నారు. హిందూ రాజుల యుగం, ముస్లీం రాజుల యుగం, బ్రిటిష్ పాలనా యుగంగా విభజించి రాసిన చరిత్ర దేశ ప్రజల్లో అపోహలను రాజేస్తూ పెంచి అస్తిత్వవాదం ద్వారా దేశ విభజనకు దారితీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అటూ ఇటూ లక్షలాది మంది ప్రాణాలు కోల్పోగా దానికి మించి సంఖ్యలో నిరాశ్రయులయ్యారన్నారు. ముస్లీం మతవాదులు పాకిస్తాను చేజిక్కించుకుని ఆ దేశాన్ని నాశనం చేయగా, ఇండియాలో హిందుత్వ శక్తులు అధికారం చేజిక్కలేదని ఆవేదన చెంది భవిష్యత్ ప్రణాళికలు రూపొందించి విష బీజాలు వెదజల్లారని అన్నారు. తప్పుడు కథనాలు, చరిత్రను సృష్టించి, ప్రజల్లో మత చీలికలు తెచ్చి ఇంతకాలానికి దేశాన్ని హస్తగతం చేసుకున్నారని వివరించారు. లౌకిక దేశంగా బాసిల్లిన భారతాన్ని సంపూర్ణ హిందూ దేశంగా మార్చి దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర రాజకీయాలు ఊపందుకున్నాయని, ఇది ఎనభై శాతంగా ఉన్న హిందువులకు కూడా నష్టదాయకమని విశ్లేషించారు. ప్రజలు కుల మతాలకు అతీతంగా ఐక్యమత్యంతో మెజారిటీ, మైనారిటీ మతోన్మాదులను ఎదుర్కొని సమైక్యత సాధించి దేశాన్ని కాపాడుకోవాలని అష్రఫ్ పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడుతూ మహనీయుడు కుడిపూడి సూర్యనారాయణ అనుసరించిన మార్క్సిస్ట్ భావజాలాన్ని అలవర్చుకుని కులమత రహిత సోదర భావాన్ని పెంపొందించి మతశక్తులను మట్టి కరిపించాలని, దాని భారి నుంచి యువతరాన్ని కాపాడుకోవాలని కోరారు. సిపిఎం నాయకులు సిహెచ్. విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సిహెచ్.రమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెద్దిరెడ్ల రాము, కృష్ణ, వాసంశెట్టి చంద్రరావు, కిరణ్, గోపు చెల్లారావు, గుత్తుల రామకృష్ణ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి గాయకులు జుత్తుగ శ్రీనివాసరావు, లోవరాజు, ప్రసాద్ బృందం విప్లగేయాలు ఆలపించారు.

ప్రపంచ నాయకులందరూ పుస్తక పాఠకులే : జెఎన్‌టియుకె విసి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రపంచ నాయకులందరూ గొప్ప పుస్తక పాఠకులనేని జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి విసి కెవిఎస్‌డి.మురళీకృష్ణ అన్నారు. జెఎన్‌టియుకె ప్రాంగణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసి ఫ్రీబుల్ ద బుక్ బఫే కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. యుసిఇకె ప్రిన్సిపల్ ఎన్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా, గౌరవ అతిథులుగా రెక్టార్ కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఒఎస్‌డి డి.కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఫ్రాన్స్ దేశంలోని ఓపెన్ లైబ్రరీని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఫేస్ బుక్ కు అలవాటుపడిన విద్యార్థులు పుస్తక పఠనాన్ని విస్మరిస్తున్నారన్నారు. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలు, నగర ప్రముఖులు, అధ్యాపకులు అందజేసిన సాధారణ, సాంకేతిక పుస్తకాలను సెంట్రల్ లైబ్రరీ రీడింగ్ రూమ్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. అనుబంధ కళాశాలల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టేలా చర్యలు చేపడతామన్నారు. రెక్టార్ రమణ మాట్లాడుతూ ఏదైనా అంశం గురించి తెలుసుకోవాలంటే లైబ్రరీకి వెళ్లకుండా స్మార్ట్ ఫోన్లపై ఆధారపడుతున్నారన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి సారిస్తే జ్ఞానాన్ని సముపార్జించడంతో పాటు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చన్నారు. పుస్తక సేకరణను ఒక అలవాటుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.సుబ్బారావు, కె.రాము, ఎఎం.ప్రసాద్, ఎంహెచ్‌ఎం.కృష్ణప్రసాద్, మాజీ విసి జివిఆర్.ప్రసాదరాజు, అసిస్టెంట్ లైబ్రేరియన్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జ్ విసి

పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్ అందజేత

ప్రజాశక్తి - గొల్లప్రోలు

టెస్ట్ పేపర్స్‌తో విద్యార్థులు, దాత, ఉపాధ్యాయులు

చేబ్రోలులోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ప్రచురించిన మోడల్ టెస్ట్ పేపర్లను గురువారం అందించారు. గొల్లపల్లి నాగేశ్వరావు కుమారుడు గొల్ల పల్లి బాబి సాయంతో రూ.30వేల విలువ చేసే టెస్ట్ పేపర్లను అందించారు. బాబికి యుటిఎఫ్ మండల శాఖ ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి స్రవంతి, చేబ్రోలు స్కూలు స్థలదాత చల్లా చినబాబు, డివైఇఒ నాయుడు వెంకటేశ్వరరావు ఎంఇఒ-2 డి.శివప్రసాద్, హెచ్‌ఎం .సూరిప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు సత్యనారాయణ

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును తక్షణమే ప్రభుత్వం పున్నరుద్ధరించాలని ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సంఘ అధ్యక్షుడు తాడిశెట్టి గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు అందవలసిన సంక్షేమ పథకాలు అందక కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. సంక్షేమ బోర్డు నుంచి రావలసిన క్లెయిమ్స్ కోసం వందలాది కార్మిక కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని అన్నారు. ఈ నెల 27న ఎలక్ట్రీషియన్ డే వేడుకలు ఘనంగా జరపాలని తీర్మానించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఉప్పల ఉమామహేశ్వరరావు, బైలపూడి రాంబాబు, పి.జోగుబాబు, షేక్ ఇబ్రహీం, సిమ్మ రామ్మూర్తి, కోణాల కుమార్, కట్టా నాగేంద్ర పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పండుగ వేళల్లో సైతం పని లేకుండా పస్తులతో జీవిస్తున్న చేనేత కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని చేనేత కార్మికులు కోరారు. గురువారం మండలంలోని ఇంజరం చేనేత సొసైటీ వద్ద స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ అధ్యక్షతన చేనేత కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రతి ఏడాది రూ.24 వేలు గత ప్రభుత్వం అందజేసిందని అన్నారు. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలైనా చేనేత కార్మికులను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకి 14 గంటలు పనిచేస్తున్న కుటుంబానికి రూ.500లు కూడా రావడం లేదని అన్నారు. చేనేత కార్మికులు ఎన్‌వివి.సత్య నారాయణ, లక్కింశెట్టి లోవకృష్ణ, నూలు జగన్నాథం, ఇనుమర్తి సూర్యకాంతం తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం విద్యుత్ మగ్గాలనును ప్రోత్సహించడం వల్ల చేనేత పరిశ్రమ కుంటు బడిపోయిందని అన్నారు. గతంలో సంక్రాంతి పండుగకు మూడు నెలల ముందే మాస్టర్ వీవర్స్ నుంచి ఆర్డర్లు వచ్చేవని, ప్రస్తుతం ఆర్డర్లు రాక పనిలేకుండా పోయిందన్నారు. పని లభించని చేనేత కార్మికులు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీ నేటికి అమలు కాలేదని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు.

నినాదాలు చేస్తున్న చేనేత కార్మికులు

కార్మికురాలి మృతదేహంతో ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ధర్నాలో పాల్గొన్న కుటుంబ సభ్యులు, కార్మికులు

ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి అవంతి ఫ్రోజోన్ ఫుడ్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో పనిచేస్తు మృతి చెందిన కార్మికురాలు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ వద్ద మృతదేహంతో గురువారం రాత్రి బంధువులు, కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామానికి చెందిన జామి మహాలక్ష్మి(32) ఫ్యాక్టరీలో పని చేస్తుందన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఎసి రూమ్‌లో పనిచేస్తూ మంగళవారం మధ్యాహ్నం ఊపిరాడక పడిపోయిందన్నారు. అపస్మారక స్థితిలోకి చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలో మహాలక్ష్మిని ఫ్యాక్టరీ సిబ్బంది రాజమండ్రిలో ఆస్పత్రికి తరలించారన్నారు. పరిస్థితి విషమించి మంగళవారం సాయంత్రం మతి చెందింది అని తెలిపారు. మృతురాలికి భర్త ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ ఆర్థిక సమస్యల నేపథ్యంలో ఫ్యాక్టరీలో పనిచేస్తుందన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కుటుంబానికి పిఎఫ్ పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు గ్రామస్తులు, బంధువులు తోటి కార్మికులు పాల్గొన్నారు.

మంజూరైన పనులను తక్షణమే చేపట్టాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన పనులను తక్షణమే చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ప్రత్తిపాడు, వేములపాలెం, పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో ఆయన పర్యటించారు. తొలుతగా ప్రత్తిపాడు పిహెచ్‌సిని పరిశీలించారు. అలాగే స్థానిక సిహెచ్‌సిలోని పలు విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ప్రసుతి వార్డులో ఉన్న మహిళలతో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం వేములపల్లిలోని ఎంపిపి పాఠశాలను పరిశీలించారు. నూతన పాఠశాల భవనం నిర్మాణ సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎపిఇడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం పెద్దిపాలెం పిహెచ్‌సిని సందర్శించి వార్డులు, మరుగు దొడ్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు మరుగుదొడ్లు పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉత్తరకంచిలో నిర్మిస్తున్న సిసి రోడ్డును ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. మెనూ ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన నూతన భవనానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ సూచన మేరకు అవసరమైన పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. గిరిజన ఆవాసాలకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాల్లో బిటి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. గోకవరం, లంపకలోవ నుంచి రౌతుపాలెం, వేములపాలెం, పెద్దిపాలెం నుంచి ఉత్తరకంచి ఉన్న గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పర్యట డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఎస్.స్వప్న, స్థానిక పిహెచ్‌సి వైద్య అధికారి డాక్టర్ డి.సౌమ్యమైకెల్, తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపిడిఒ ఎంవిఆర్. కుమార్‌బాబు, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ సిహెచ్. రత్నంరాజు, పెద్దిపాలెం పిహెచ్‌సి వైద్య అధికారి డాక్టర్ యశస్వీ కొండేపూడి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీల్లో మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్

డీలర్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తహశీల్దార్ జి.చిన్నారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వ్యక్తులు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత సాధించాలని, ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులు లేకపోతే ఇంటర్ విద్య ఫెయిల్ వారికి అవకాశం కల్పిస్తామని అన్నారు. దరఖాస్తు చేరుకునేనాటికి 18 సంవత్సరాల పూర్తయి 40 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. దరఖాస్తుందారుడు ఆయా గ్రామా పంచాయితీకి చెందిన వారై ఉండాలని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వాటర్ గుర్తింపు కార్డుతోపాటు నివాస ధ్రువపత్రం డోర్ నెంబర్‌తో సహా ఉండాలన్నారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా నేరుగా తహశీల్దార్ కార్యాలయంలో కాని, రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కానీ దరఖాస్తులు అందించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

మతసామరస్యం పాటించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మత సామరస్యాన్ని పాటించాలని సిపిఎం నాయకులు పిలుపునిచాచరు. సిపిఎం ఆధ్వర్యంలో దేశ సమైక్యత, మత సామరస్యం వర్ధిల్లాలి అంటూ నూతన సంవత్సరం శుభాకాంక్షలతో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్, టి.ఈశ్వరరావు మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో అన్ని మతాలు, కులాల ప్రజలందరూ ఐక్యంగా పోరాడారన్నారు. తద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. భారత దేశం విభిన్న మతాల సంస్కృతుల సమ్మేళనం అన్నారు. గత పది సంవత్సరాల నుంచి కేంద్రంలో అధికారానికి వచ్చిన బిజెపి ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ ఓట్ల రాజకీయం చేస్తుందన్నారు. ప్రజల మధ్య చీలికలు తెస్తుందన్నారు. ఈ కుట్రలను ప్రజలు భగ్నం చేయాలన్నారు. ఇందులో భాగంగానే సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు దుప్పి అదృష్టదీపుడు, నేరేడుమల్లి త్రిమూర్తులు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ : ఎంఎల్ఎ నెహ్రూ

ప్రజాశక్తి - జగ్గంపేట

అర్హులందరికీ పింఛన్లను పంపిణీ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక రావులమ్మ నగర్ టిడిపి కార్యాలయంలో వితంతు పింఛన్లను ఆయన గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ పథకంలో భాగంగా సామాజిక భద్రత పింఛన్లు ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పింఛన్ల పంపిణీలో స్పౌజ్ కేటగిరీ తీసుకొచ్చిందన్నారు. వితంతువులకు వెంటనే పింఛను మంజూరు చేసేలే ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, జీను మణిబాబు, పంచాయతీ కార్యదర్శి రాజన్ రాజు, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేడు మత్స్యకారులకు నష్టపరిహారం పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

ఒఎన్‌జిసి సంస్థ నుంచి మత్స్యకారులకు విడుదలైన నష్ట పరిహారం పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరగనున్నట్లు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు తెలిపారు. పంపిణీ కార్యక్రమం సందర్భంగా నిర్వహించే సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నష్టపరిహారంలో భాగంగా రూ.148.37 కోట్లను ఆయా లబ్ధిదారుల ఖాతాలకు ప్రభుత్వం శుక్రవారం జమ చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని 4 మండలాలతో పాటు, అయినవిల్లి, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కొత్తపేట మండలాలకు చెందిన 23,458 మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరుందని తెలిపారు. ఒఎన్‌జిసి సంస్థ 2 సంవత్సరాల కాలానికి మత్స్యకారులకు నష్టపరిహారంగా ఒక్కో లబ్ధిదారునికి రూ.63,250 చొప్పున విడుదల చేస్తున్నట్లు చెప్పారు. పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర, పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, పలువురు ఎంఎల్ఎలు, జిల్లాస్థాయి మత్స్య శాఖ అధికారులు పాల్గొంటారని తెలిపారు. లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ, జనసేన నాయకులు

విలువలకు కట్టుబడేది 'ప్రజాశక్తి'

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎంఎల్ఎ పంతం

ప్రజాశక్తి - కరప

నిరంతరం విలువలకు కట్టుబడి ప్రజల పక్షాన నిలబడేది 'ప్రజాశక్తి' దినపత్రిక అని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. గురువారం తన స్వగృహంలో ఆయన ప్రజాశక్తి-2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి విలువలకు కట్టుబడి సమస్యలను అక్షరాలా రూపంలో నిర్భయంగా ప్రస్తావించేది ప్రజాశక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, నున్న గణేష్‌నాయుడు, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ, పేకేటి దుర్గాప్రసాద్, సైనవరపు భవాని శంకర్, ముద్రగడ రమేష్, సతీష్, వంశి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిట్టిబాబు పుట్టిన రోజు వేడుక

ప్రజాశక్తి - గండేపల్లి

చిట్టిబాబుకు కేక్‌ను తినిపిస్తున్న అభిమానులు

ప్రజా సేవకుడు, టిడిపి నాయకుడు జడ్.రాగంపేట సర్పంచి కందుల చిట్టిబాబు పుట్టిన రోజు వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల క్రితం తన అన్న స్వర్గీయ కందుల కొండయ్యదొరతో ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానం నేటికీ ప్రజల ఆధారాభిమానాలతో కొనసాగుతుందని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడుగా, ఆత్మ ఛైర్మన్‌గా, గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. జీవితాంతం నన్ను ఆదరించే ప్రజల, అభిమానుల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుల విజయ్, వినయ్, సాయి, రాంబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డివైడర్‌ను ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీ కొని ఇద్దరు యువకులకు మృతి చెందారు. రాజమహేంద్రవరం మోరంపూడికి చెందిన ఇద్దరు యువకులు లింగం నవీన్‌చంద్, లింగం సంతోష్‌కుమార్ జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంటన్నర ప్రాంతంలో మురారి గ్రామం వద్ద డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో లింగం నవీన్ చంద్(21) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు లింగం సంతోష్‌కుమార్(20) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ శివనాగు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యాపారి మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని జార్జిపేట కోనేరు సమీపంలో ఒక వ్యాపారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నీలపల్లి గ్రామానికి చెందిన కుడిపూడి మల్లికార్జునరావు (45), జార్జిపేట గ్రామానికి చెందిన కాకరపల్లి శ్రీనివాసు ఇద్దరు స్నేహితులు. ఇద్దరూ ఉమ్మడిగా వ్యాపారం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మల్లికార్జునరావు తన వ్యాపార భాగస్వామి శ్రీనివాస్ ఇంటి వద్ద మెడకు ఉరి వేసుకుని మృతి చెందాడు. సంఘటన స్థలానికి కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణ చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య దుర్గామణి, కుమారుడు సిద్ధార్థ, కుమార్తె బేబీశంకర అనిజ ఉన్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణంలోని ఎల్‌సి రైలుగేటు సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీ కొని 50 ఏళ్ల వయస్సుగల వ్యక్తి మృతి చెందాడు. గురువారం స్థానిక రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఎల్‌సి గేటు సమీపంలో రైలు ఢీ కొట్టగా వ్యక్తి మృతి చెందాడని, అతని వివరాలు తెలియరాలేదని తెలిపారు. మృతుని శరీరంపై నీలం గడుల లుంగీ, ఎరుపు నలుపు చిన్న గడులు కలిగిన కురచ చేతుల చొక్కా ఉన్నాయనఆనరు. ఆచూకీ తెలిస్తే సామర్లకోట రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

బైకులు ఢీకొన్న ఘటనలో గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్తున్న బైక్ గ్రామంలో డివైడర్ దాటుతున్న మరో బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామానికి చెందిన అనుశెట్టి కష్ణమూర్తి, దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన రాయుడు గోవింద్, ఆర్.చందులకు గాయాలయ్యాయి

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోటనందూరు

గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడ్డి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు... తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో తుని-గుల్లిపాడు మధ్య పాయకరావుపేట ఇందిరా కాలనీకి సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామన్నారు. తుని వైపు నుంచి నర్సీపట్నం వైపు వెళ్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెందినట్టు అనుమానిస్తున్నామని తెలిపారు. మృతుని వయస్సు 21 ఏళ్లు ఉంటుందన్నారు. ఎరుపు రంగు చొక్కా, సిమెంట్ రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృత దేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

2వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు గ్రామ శివారు సారా తయారీ కేంద్రంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. 2వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని సిఐ సూర్యాఅప్పారావు తెలిపారు. పోలవరం కాలువ శివారులో ఉన్న సారా బట్టీపై సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామన్నారు. సారా తయారీ కేంద్రాలు, అమ్మకాలపై నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీకాంతం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని వద్దిపర్రు వద్ద మధ్య డెల్టా ప్రధాన కాలువలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన మేడిది శ్రీను. తన భార్యభర్తలు. జీవనోపాధి నిమిత్తం శ్రీను దుబాయ్, అతని భార్య రోజా సింగపూర్ వెళ్లారు. శ్రీను రెండు రోజుల క్రితం దుబాయ్ నుంచి వచ్చాడు. మండలంలోని వద్దిపర్రు గ్రామంలో వరసకు వదిన అయిన వీరవల్లి వెంకటలక్ష్మి వద్ద ఉంటున్న తన కుమారుడు, కుమార్తెను కలిసేందుకు గతేడాది డిసెంబర్ 31వచ్చాడు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో వద్దిపర్రు వద్ద మధ్య డెల్టా కాలువలో పడి చనిపోయాడు. శ్రీను సోదరుడు మేడిది వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎన్.రాము తెలిపారు.

లారీ బోల్తా : వ్యక్తికి గాయాలు

రాజమహేంద్రవరం : నగరంలో లాలాచెరువు సమీపంలో గురువారం రాత్రి గ్యాస్ లోడ్ లారీ డివైడర్ ఢీకొని పార్కు సమీపంలో బోల్తా పడింది. లారీ వెనుకగా వస్తున్న ఆటోనగరర్‌కు చెందిన పోలవరపు శివన్నారాయణపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రోడ్డుపై లారీ బోల్తా పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు క్రేన్ సహాయంతో లారీని పక్కకు తొలగించారు

విద్యాకమిటీ చైర్మన్లకు శిక్షణ

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యా కమిటీ చైర్మన్లకు జిల్లాలో పలుచోట్ల గురువారం ఒక్కరోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. **సామర్లకోట** మండలంలోని ఐదు స్కూల్ కాంప్లెక్స్‌కు చెందిన పాఠశాల హెచ్ఎం లు, ఎస్ఎంసి సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్య క్రమం స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో జరిగింది. ఎంఇఒలు వై.శివ రామకృష్ణయ్య, పి.పుల్లయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్‌పిలు పాఠశాల అభివృద్ధికి, ఎస్ఎంసి సభ్యులు చేపట్టాల్సిన విధి నిర్వహణకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఎస్ఎంసి ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.**గొల్లప్రోలు** మండలం చేబ్రోలు జడ్‌పి పాఠశాలలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కాకినాడ ఉప విద్యాశాఖ అధికారి నాయుడు వెంకటేశ్వరావు పాల్గొని మాట్లాడారు. పాఠశాల అభివద్ధి ప్రజల భాగస్వామితో ముడిపడి ఉందన్నారు. దీనికి చైర్మన్లు కృషి చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్స్ వై.శ్రీనివాసరావు, కెఎస్ఆర్.మూర్తి, డి.శ్రీకాంత్ పాల్గొని అవగాహన కల్పించారు. మొబైలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరరావు పరిశీలించారు. ఎంఇఒ వెంకట శివప్రసాద్, జిఆర్ఎంటిలు పాల్గొన్నారు. **తాళ్లరేవు**లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ఎంఇఒ మోకా ఉమ పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి ప్రగతి సాధించేలా పాఠశాల విద్యా కమిటీలు కృషి చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్లు ఎస్.మురళీకృష్ణ, కె.వీరేంద్ర, కె.సత్యకళ్యాణి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. **కోటనందూరు** జడ్‌పిహెచ్ఎస్‌లో మండల స్థాయి ఉపాధ్యాయ, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్లకు శిక్షణ నిర్వహించారు. ఎంఇఒలు శ్రీనివాస్, రామశేఖర్ అధ్యక్షతన ఈ శిక్షణ జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు వేణుగోపాల్, సిఆర్‌పి వెంకటగోవిందశేఖర్, రిసోర్స్ పర్సన్స్ అత్చియ్యనాయుడు, నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. **కరప** మండలంలోని 65 పాఠశాలలకు గురువారం యాజమాన్య కమిటీల చైర్మన్ల శిక్షణను అందించామని ఎంఇఒలు కెబి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. రిసోర్స్ పర్సన్స్‌గా రామ్మోహన్, డేగల లక్ష్మి, రామకృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి 130 మంది హాజరయ్యారు. **రౌతులపూడి**లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒలు ఎ.శ్రీనివాస్, గాడి కొండబాబు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి అభివృద్ధి కమిటీలు సహకారం అందించాలన్నారు. ఈ మేరకు హెచ్ఎంలకు, చైర్మన్లకు శిక్షణ నిర్వాహించామన్నారు.

డాక్టర్ యనమదలకు 'మానవతా' అవార్డు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రముఖ ఎయిడ్స్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణ మానవతా స్వచ్ఛంద సేవాసమితి అవార్డును అందుకోనున్నారు. వైద్య రంగంలో పేదలు, సామాన్యులకు ఎటువంటి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నందుకు గానూ ఆయనకు ఈ అవార్డు లభించింది. ముఖ్యంగా ఎయిడ్స్ వ్యాధి పట్ల పలువురు రోగులకు అవగాహన కల్పించడంతోపాటు అతి తక్కువ ఖర్చుతోనే వ్యాధి నిర్మూలనకు యనమదల కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన మానవతా స్వచ్ఛంద సేవాసమితి 50వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 5న అమలాపురం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో జరగనున్న కార్యక్రమంలో అవార్డు ప్రధానం చేయనున్నారని డాక్టర్ మురళీకష్ణ తెలిపారు.

రంగవల్లుల పోటీల్లో 'ప్రతిభ' విద్యార్థుల హవా

ప్రజాశక్తి- సామర్లకోట

ఎ సిటీ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 1న పెద్దాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ అంశంతో కూడిన రంగవల్లుల పోటీల్లో సామర్లకోట ప్రతిభా విద్యానికేతన్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. 8వ తరగతికి చెందిన కె.అవంతిక, సిహెచ్.విద్యాజ్యోత్స్న, సిహెచ్.దీపాంజలి బృందం ప్రదర్శించిన 'ఇస్రో- పిఎస్ఎల్‌వి(60) మిషన్ సక్సెస్ ఫుల్' అనే అంశంపై వేసిన రంగవల్లిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వివిజి.ప్రకాష్ చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ సామర్లకోట మండల స్థాయిలో స్థానిక బచ్చు ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి శాస్త్రీయ వైజ్ఞానిక ప్రదర్శనలో 8వ తరగతి విద్యార్థిని సిహెచ్.దీపాంజలి ప్రదర్శించిన గణిత అంశం ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల స్థాయిలో తాము అందించే అత్యుత్తమ విజ్ఞానానికి ఈ విజయాలే నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల డైరెక్టర్ సుధారాణి ప్రకాష్, ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో శ్రీవివేకానంద ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

మండల స్థాయి విద్య-వైజ్ఞానిక ప్రదర్శనలో శ్రీ వివేకానంద పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనపరచారని విద్యాసంస్థల ఛైర్మన్ సిహెచ్.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ బిఎ.సరోజినీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.శైలూష తెలిపారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి విద్య-వైజ్ఞానిక ప్రదర్శనలో తమ సంస్థ విద్యార్థులు వ్యక్తిగత విభాగంలో సిహెచ్‌వి.కాషా, వై.రిషిక, ఎ.శరణ్య సాయి, ఉపాధ్యాయిని ఎ.శైలజ మొదటి స్థానం సంపాదించుకుని జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారని తెలిపారు. గ్రూప్ ప్రదర్శన విభాగంలో విద్యార్థులు సిహెచ్.శ్రీజ, ఎన్.సుదీప, ఉపాధ్యాయుడు సిహెచ్.శ్రీనివాసరావు రెండవ స్థానం సాధించారని, మొత్తం ఐదు స్థానాల్లో మూడు స్థానాలను గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు.

సైన్స్‌రంగోలి పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన సైన్సు రంగోలి పోటీలకు విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ రంగవల్లులను తిలకించిన వారు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా అధ్యాపకురాలు సంధ్య, వైఆర్ఎల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లావణ్య, డ్రాయింగ్ టీచర్ మహాలక్ష్మి వ్యవహరించారు. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీల్లో 5వ తరగతి నుంచి పీజీ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవత రాజేష్‌కుమార్, పెద్దిరెడ్డి నరేష్, రొంగల అరుణ్‌కుమార్, శ్యామ్‌కుమార్, నవీన్ నాని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన కోడి నాగుల శ్రీనివాసు అప్పుల భారం భరించలేక మనస్థాపనకు గురై ఇటీవల పురుగులు మందు తాగిన విషయం పాఠకులకు విధితమే. సదరు శ్రీనివాస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో గురువారం మృతి చెందాడు. అతని భార్యకోడినాగుల దుర్గాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్ సి ముజువుద్దీన్ తెలిపారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎల్ఎ, డిఎస్‌పి

గ్రామీణ క్రీడోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో గ్రామీణ క్రీడోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో 3 మండలాల పరిధిలో క్రీడాకారులకు వీటిని నిర్వహిస్తున్నారు. జగ్గంపేట డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ క్రీడోత్సవాలను స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ గ్రామీణ సంప్రదాయ క్రీడలు కనుమరుగవుతున్న తరుణంలో ఈ పోటీలు నిర్వహిస్తున్న సిఐ, ఎస్ఐలను అభినందించారు. 6 రోజులపాటు నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. డిఎస్‌పి శ్రీహరి రాజు మాట్లాడుతూ 2025 న్యూ ఇయర్, సంక్రాంతి సందర్భంగా ఇంత పెద్ద ఎత్తున గ్రామీణ క్రీడా పోటీలను ఏర్పాటు చేసిన సిఐ, ఎస్ఐలు అభినందనీయులన్నారు. అనంతరం కబడ్డీ పోటీలను రిబ్బన్ కట్ చేసి పావురాలను ఎగురవేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, ఎంపిపిలు తోట రవి, అత్తులూరి నాగబాబు, ఎస్‌వీఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, చదరం చంటి బాబు, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, సిడిఇఒ పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

గజమాలతో కన్నబాబును సత్కరిస్తున్న ముదునూరి

కన్నబాబును కలిసిన ముదునూరి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వైసిపి జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబును వైసిపి నాయకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా కన్నబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. భారీ గజమాలతో కన్నబాబును సత్కరించారు. కన్నబాబు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ముదునూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశానన్నారు. నియోజకవర్గంలో ఎంఆర్ ట్రస్ట్ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరరావు, మాగపు శివ పాల్గొన్నారు.

డీలర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో ఖాళీగా ఉన్న 18 రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహశీల్దార్ పి.త్రినాథరావు తెలిపారు. తాళ్లరేవు పంచాయతీలో 3, కోరంగి పంచాయతీలో 5, గాడిమొగలో 3 జి.వేమవరం 3, లచ్చి పాలెం 1, తంగేడు పంపు1, రామన్నపాలెం 1, చొల్లంగి1 ఖాళీగా ఉన్నాయన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన స్థానికులకు అవకాశం కల్పిస్తారన్నారు. ఈ నెల 19న కాకినాడలో రాత పరీక్ష జరుగుతుందన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులు స్థానిక తహశ్శీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 8దీలోపు దరఖాస్తులను అందించాలన్నారు.

వెంకన్నదొర కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామపురం మాజీ సర్పంచ్ సోమరౌతు భాస్కర వెంకన్న దొర ఇటీవల అనారోగ్యం గురై మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం పరామర్శించారు. మృతికి గల కారణాలను ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

మేనరిక వివాహాల అనర్థాలపై కళాజాతా

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని నాగులాపల్లి, ఇసుకపల్లి గ్రామాల్లో మేనరికం వివాహాలపై పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో కళా జాతర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య భారతి కళా సంఘం ఆధ్వర్యంలో మేనరికం వివాహాలు-వాటి దుష్ప్రభావాలపై బుర్ర కథ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగులాపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సౌజన్య, డాక్టర్ రిచ్చా, హెచ్ఎస్.అప్పారావు, హెచ్ఇ గౌరీశ్వరి, హెచ్‌వి.జ్యోతిప్రసన్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ కాకరపల్లి గంగాధర్ శ్రీనివాసరావు, ఎఎన్ఎంలు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సభలో 18 దరఖాస్తులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని ఆనూరు, కొండపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో ప్రజల నుంచి సమస్యలు పరిష్కారం కోరుతూ 18 దరఖాస్తులు అందాయని తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సభల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆన్‌లైన్ ఆర్ఒఆర్ కోసం 4, పట్టాదారు పాస్ పుస్తకం కోసం ఒకటి, భూమి సర్వే కోసం 13 దరఖాస్తులు అందాయన్నారు.

యానాం వార్తలు

కాకినాడ కలెక్టర్‌తో మల్లాడి భేటీ

కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్‌తో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం భేటీ అయ్యారు. తొలుత ఇరువురు పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలకు విచ్చే యాలని ఆహ్వాన పత్రికను కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

ఎంఎల్ఎ అశోక్‌కు శుభాకాంక్షలు

నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కి వివిధ శాఖల అధికారులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి ఎంఎల్ఎ అశోక్‌ని కలిసి దుస్సాలువాతో సత్కరించారు. అనంతరం ఎంఎల్ఎ అశోక్ మునిస్వామిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, అగ్నిమాపక, ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, టీచర్స్ అసోసియేషన్, పాలిటెక్నిక్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా ఉత్సవాలపై సమీక్ష

నియోజకవర్గంలో జనవరి 6 నుంచి 8 వరకు నిర్వహించే ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలపై ఆర్ఎఒ మునిస్వామి తన ఛాంబర్‌లో అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రజా పనుల శాఖ, మత్స్యశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, పౌరసరఫరాల శాఖ, పశు వైద్య శాఖ, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

ట్రెజరీ కాలనీలో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ

నూతన సంవత్సరం సందర్భంగా ప్రచురించిన 'గడప లోపల మతం - గడప దాటితే భారతీయులం' కరపత్రాలను స్థానిక ట్రెజరీ కాలనీలో సిపిఎం నాయకులు గురువారం ఇంటింటికీ పంచారు. మనం భారతీయులంగా దేశ సమైక్యతను కాపాడుకోవాలని, మతోన్మాద ప్రమాదాన్ని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.వీరబాబు, కె.సింహాచలం, యు.సత్యనారాయణరెడ్డి, పివి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హోమియో మందు పంపిణీ

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురు వారం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యం లో చికెన్‌ఫాక్స్ సోకకుండా హోమియో మందును విద్యార్థు లకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ పింగళి ఆనందకుమార్ మాట్లాడుతూ ఈ హోమియో మందును రోజుకు నాలుగు చొప్పున మూడు రోజుల పాటు ఇవ్వడంవల్ల విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి చికెన్‌ఫాక్స్ రాకుండా అరికట్టొచ్చన్నారు. ఈ వ్యాధి బారిన పడిన విద్యార్థులకు ఉచితంగా చిత్రాడలోగల ఎంబిఎం హోమియో క్లినిక్‌లో చికిత్స అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వరి, కృష్ణకుమార్, హెచ్ఎం వివివి.రామకృష్ణ, ఎస్ఎంసి ఛైర్ పర్సన్ పి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. 1023/2024 in O.S. 82/2007

Between:
1) పాలకుర్తి సుబ్బారావు (డైడ్)
2) పాలకుర్తి సీతా మహాలక్ష్మి
3) పాలకుర్తి సత్యనారాయణ ప్రసాద్ ...వాదులు

మరియు

వుమ్మెళ్ళ అన్నపూర్ణమ్మ వగైరా ...ప్రతివాదులు
29వ ప్ర రెస్పాండెంట్ ...ప్రతివాది
బొడ్డు విజయకుమార్, తండ్రి: శ్రీకృష్ణారావు, డోర్ నెం.16-5-10, కొత్తూరు, సామర్లకోట-533440, కాకినాడ జిల్లా

పై నెంబరు పిటిషన్‌లో (మిమ్ములను మీ అమ్మగారు సత్యవతి చనిపోయినందున వారసులుగా చేర్పించమని) మీకు శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనుక EVADE చేసినందున, నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఇమ్మని శ్రీ కోర్టును వారు ఆర్డర్ చేసియున్నారు. వాయిదా **10-01-2025** సంవత్సరమునకు ఉన్నది. మీరు వాయిదా రోజు అనగా **10-01-2025** సం॥తేదీన ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా కోర్టుకు హాజరై ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల మనవి చేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

ఉప్పలూరి రామారావు
కాకినాడ అడ్వకేట్, 63-3-4బి, ఉప్పలూరివారి వీధి
ది.31-12-24 కాకినాడ-3, సెల్: 99490 45514

ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న దళితులు

చెత్త డంపింగ్‌పై దళితుల ఆగ్రహం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రంగప్ప చెరువును డంపింగ్ యార్డ్‌గా మార్చేడంతో దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు ఉన్న ఫెన్సింగ్‌ను, ఇనుప స్తంభాలను తొలగించారు. గొల్లప్రోలు పట్టణంలో సర్వే నెంబర్ 560లో 13.12 ఎకరాల విస్తీర్ణంలో రంగప్ప చెరువు ఉంది. అరుంధతి పేటకు చెందిన దళితులు ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. ఎప్పటి నుంచో ఊరిలో చెత్తకు ఇక్కడే డంప్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో దాని చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో గురువారం అరుంధతి పేటకు చెందిన దళిత అక్కడకు చేరుకున్నారు. డంపింగ్ యార్డ్ చుట్టూ ఉన్న ఫెన్సింగ్ వాల్ గోడను, ఇనుప రాడ్లను తొలగించారు. అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు వీలు లేకుండా ఫెన్సింగ్ వాల్ నిర్మించారన్నారు. చెత్తను ఇక్కడి డంప్ చేయొద్దంటూ పలుమార్లు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. చెత్త తరలించకుండా దానికి ఫెన్సింగ్ నిర్మించడంతో తొలగించామన్నారు. విషయం తెలుసుకున్న అధికారులు కాకినాడ ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ భావన, తహశీల్దార్ కెవి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.స్వప్న, మున్సిపల్ ఎఇ ప్రభాకర్, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దళిత నాయకులు గంధం నాగేశ్వరరావు నేకూరి ప్రసాద్, టి.పల్లంరాజు తదితరులతో చర్చలు జరుపుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి -సామర్లకోట, పిఠాపురం, పెదపూడి

సామర్లకోట రూరల్ 33/11కెవి ఆర్‌బి.పట్నం ఎస్‌లో 11 కెవి ఫీడర్స్ పరిధిలో ట్రీ కటింగ్ పనుల నిమిత్తం 11కెవి జి.మేడపాడు రూరల్, 11కెవి ఆర్‌బి.పట్నం ఇండస్ట్రియల్ ఫీడరు పరిధిలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్‌డిఎన్.ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట మండలం జి.మేడపాడు, జి.కొత్తూరు, పిబి.దేవం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే పిఠాపురం మండలంలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ 33/11 కెవి.పిఠాపురం సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11కెవి పరిధిలో గల పట్టణంతోపాటు, రాయవరం, పి.తిమ్మాపురం, గోకివాడ, కోలంక, జములపల్లి, మాధవపురం, ఇల్లింద్రాడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఉండదని ఇఇ ప్రభాకర్ తెలిపారు. అలాగే పెదపూడి మండల పరిధిలోని జి.మామిడాడ 33/11కెవి సబ్-స్టేషన్లో పవర్ ట్రాన్సఫార్మర్ మార్పు నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని ఇఇ ఎన్.ఉదయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ధాన్యం వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చంద్రవరం గ్రామానికి చెందిన గారపాటి సత్తిబాబు వద్ద కొవ్వూరు పట్టణానికి చెందిన దుద్దుపూడి సూరిబాబు ధాన్యం కొంటానని చెప్పి నాలుగు లోడుల ధాన్యం తీసుకెళ్లాడు. డబ్బులు ఇవ్వకుండా మోసగించి పరారైనట్టు సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నరేంద్ర కేసు నమోదు చేశారు. సూరిబాబును అరెస్టు చేసి గురువారం నిడదవోలు కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్టు తెలిపారు. సూరిబాబుపై కొవ్వూరు రూరల్, కొవ్వూరు టౌన్, సీతానగరం, గోకవరం, జంగారెడ్డిగూడెం, ఐ.పోలవరం, పెడన, వీరఘట్టం తదితర పోలీస్ స్టేషన్లలోనే కాక ఒడిషాలో కూడా పలు మోసపూరిత నేరాలు చేసినట్టు తెలిపారు. ధాన్యం, మొక్కజొన్న, మైదా, నూకలు వంటివి ఎక్కువ రేటుకు కొంటానని నమ్మించి వారి వద్ద నుండి లోడులు తీసుకుని వెళ్లి అమ్ముకుని వారికి డబ్బులు ఇవ్వకుండా పరారవుతున్నట్టు తెలిపారు.

బాలల పరిరక్షణకు కృషి చేయాలి

పెద్దాపురం : బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసిడిఎస్ పీడీ కె.ప్రవీణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష అధ్యక్షతన మండల స్థాయి కిశోర బాలికా వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి గ్రామస్థాయిలో 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసుకులైన బాలలతో గ్రూపులు ఏర్పాటు చేసి వారికి బాలల చట్టాలు, బాలల పరిరక్షణ అంశాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపిడిఒ శ్రీలలిత, ఎస్ఐ మౌనిక మాట్లాడారు. ఈ సదస్సులో డాక్టర్ బి.చంద్రకిరణ్, ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పడిపోయినవి

విశాఖపట్నం రేసపువానిపాలెంలో అపార్ట్‌మెంట్‌లోని ప్లాటుకు సంబంధించి అల్లూరి వీర వెంకటపతి రాజు, S/o. వెంకట సుబ్బరాజు, సర్వే నెంబర్ 7, ప్లాట్ నెంబర్ 36బి, 51బి కు సంబంధించిన 1360/1996 నెంబరు గల డాక్యుమెంట్ పడిపోయినవి. ది. 26-12-2024వ తేదీన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేనికోన మండలంలోని మా ఇంటి వద్ద నుండి జిరాక్స్ నిమిత్తం గేటు సెంటర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అల్లూరి వీర వెంకటపతిరాజు
S/o. వెంకట సుబ్బరాజు, మెయిన్‌రోడ్
కాట్రేనికోన గ్రామం మరియు మండలం
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్: 8247550212

CHANGE OF NAME

I, **NEELIMA MADHU**, W/o. **Srinivasa Rao Sirigudi**, R/o. D.No.70-3-72/1, Kothuru Street No.1, Ramanayyapeta, Kakinada (Urban), PO Engg. College, Kakinada District - 533 003, Andhra Pradesh has changed my Spouse Name from **SRINIVASA RAO SIRUGUDI** (old Name) to **SRINIVASA RAO SIRIGUDI** (new Name) for all future purposes.

IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.P.No. 603 OF 2024

Between:
N. Bhumamma and others ...Petitioners
AND
M. Rajesh & Others ...Respondents

To,
R-1: M. Rajesh, S/o. Srinivasa Rao, Aged: 26 years, Occ: Driver, R/o. H.No. 6-93, Madurapeta, Uppalaguptham, East Godavari District, Andhra Pradesh-533222.

NOTICE

Please take notice that the above Petitioners have filed the above O.P. for compensation against you and Respondent No. 2 & 3. Several times notices was issued to you through court and R.P. but you have failed to receive the same. The case is posted on the day of **24-01-2025** for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE COURT)
Sd/- **L.R.PRAKASH, C.D.ARUNA, H. SHARON,** Advocates,
H.No. 10-308/A/2, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad.
Cell: 9866611022

పబ్లిక్ నోటీసు
మహారాజశ్రీ పెద్దాపురం 7వ అధనపు జిల్లా ఫాస్ట్ ట్రాక్ జిల్లా జడ్జి వారి కోర్టులో
గార్డియన్ ఒ.పి.నెం.96/2024

బిట్వీన్:-
వల్లూరి కృష్ణ సాయి నిహాల్ మైనర్ అయినందున తల్లి గార్డియన్ వల్లూరి మంగలక్ష్మి ...పిటీషనర్

మరియు

నిల్ ...రెస్పాండెంట్లు

ఈ నెంబరు గ్రంథములో పిటీషనరు వల్లూరి మంగలక్ష్మి భర్త. (లేటు) సత్యనారాయణ, వ. 37 సం.లు, డోర్.నెం.9-35రు, ధ్వజస్తంభం వీధి, జి.మేడపాడు గ్రామం, సామర్లకోట మండలం అను వారు ఆమె కుమారుడు వల్లూరి కృష్ణ సాయి నిహాల్, తండ్రి. (లేటు) సత్యనారాయణ, వ. 15 సం.లు, 10వ తరగతి, డోర్.నెం.9-35రు, ధ్వజస్తంభం వీధి, జి.మేడపాడు గ్రామం, సామర్లకోట మండలం తరుపున పై కోర్టులో పై నెంబరు దాఖలా గార్డియన్ పిటీషన్ ను ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమిలో సదరు మైనరు వల్లూరి కృష్ణ సాయి నిహాల్ తాలూకు 1/3వ వంతు వాటాను విక్రయించుటకు గాను శ్రీ కోర్టు వారి అనుమతి కోరుతూ పై నెంబరు పిటీషనును దాఖలు చేసినారు. సదరు గ్రంథము పై కోర్టు వారి ఎదుట **ది.20-01-2025**వ సం.రం తేదీకి వాయిదా అయి వున్నది.

కావున పై నెంబరు గ్రంథములో ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట **ది.20-01-2025**వ సం.రం తేదీన ఉదయం **10:30** గంటల లగాయితు హాజరై వారి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారు తదుపరి ఉత్తర్వులు ఇప్పించుదురు.

షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, బిక్కవోలు సబ్ రిజిస్ట్రీలో చేరిన రంగంపేట మండలం, మర్రిపూడి గ్రామ పంచాయితీ, మర్రిపూడి గ్రామం తాలూకు జిరాయితీ మెరక భూమి రి.స.నెం. 45రులో య.2-00ట్లు భూమికి హద్దులు :
తూర్పు: వల్లూరి వెంకటేష్ గారి భూమి
దక్షిణం: రిమ్మలపూడి వెంకటేశ్వరరావు గారి భూమి
పడమర: రిమ్మలపూడి చినసత్తిరాజు గారి భూమి
ఉత్తరం: రిమ్మలపూడి సుబ్బయ్యమ్మ గారి భూమి

సదరు హద్దులు మధ్య య.2-00ట్లు భూమిన్ని అందలి మామూలు మార్గములు, నీటివనరులు, యీజిమెంటు హక్కులతో సహా,

సిహెచ్. కనకదుర్గారావు
సిహెచ్. చంద్రశేఖర్
పెద్దాపురం అడ్వకేట్స్,పెద్దాపురం
02-01-2025 కాకినాడ జిల్లా